తార్నాకలో స్పెషల్ డ్రైవ్



కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్సై జయానంద్

లాలాపేట: నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు మంగళవారం తార్నాక ప్రాంతంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఆదేశాలతో తార్నాక, హబ్సిగూడ, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై నిఘా పెట్టారు. మైనర్లకు ట్రాఫిక్ నిబంధనలపై కౌన్సెలింగ్ ఇచ్చారు. లైసెన్స్ లేకుండా, హెల్మెట్ ధరించకుండా వెళ్తున్న వారికి చలాన్లు విధించారు. ఈ సందర్భంగా సబ్ ఇన్‌స్పెక్టర్ జయానంద్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత మన అందరి బాధ్యత అని ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఇబ్రహీం, రమేష్, స్వప్న పాల్గొన్నారు.

ఓయూ స్విమ్మింగ్ పూల్ మూసివేత?

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ స్విమ్మింగ్ పూల్‌ను మూసి వేయనున్నారు. అడుగు భాగంలోని టైల్స్ పూర్తిగా ధ్వంసం కావడంతో వాటికి మరమ్మతు చేయాల్సి ఉంది. దాదాపుగా రెండు నెలల సమయం పట్టనున్న నేపథ్యంలో మూసివేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

97 లొకేషన్లు.. 229 పోలింగ్ బూత్‌లు



సనత్‌నగర్‌లో 2,52,530 మంది ఓటర్లు
- పార్లమెంట్ ఎన్నికల్లో అధికారుల నిమగ్నం

సనత్‌నగర్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు అందుకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో 97 లొకేషన్లలో 229 పోలింగ్ బూత్‌ల ద్వారా పోలింగ్ జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గం రెండు జిల్లాల పరిధిలో ఉంది. హైదరాబాద్ జిల్లా పరిధిలో నియోజకవర్గానికి సంబంధించి 88 లొకేషన్లలో 200 పోలింగ్ బూత్‌లు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో 9 లొకేషన్లలో 29 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. జీహెచ్‌ఎంసీ పరంగా బేగంపేట, ఖైరతాబాద్ సర్కిళ్ల పరిధిలో విస్తరించి ఉంది. బేగంపేట సర్కిల్ పరిధిలోని బన్సీలాల్‌పేట, రాంగోపాల్‌పేట, బేగంపేట, మోండా డివిజన్లకు సంబంధించి 1 నుంచి 132 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయగా, ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలోని అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్లకు సంబంధించి 133 నుంచి 229 వరకు పోలింగ్ బూత్‌లు ఉంటాయి. ఫిబ్రవరి 8 విడుదలైన ఓటరు జాబితా ప్రకారం 2,52,530 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,30,853, మహిళలు 1,21,667, ఇతరులు 10 ఉన్నారు. ఎన్నికలకు సమయం ఉండడంతో ఓటర్ల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

బన్సీలాల్‌పేటలో అత్యధికం.. మోండాలో అత్యల్పం

నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లు బన్సీలాల్‌పేట డివిజన్‌లో ఉన్నారు. ఈ డివిజన్‌లో 60 పోలింగ్ స్టేషన్లు ఉండగా 65,150 మంది ఓటర్లు ఉన్నారు. ఆ తర్వాత అత్యధికంగా ఉన్నది సనత్‌నగర్ డివిజన్‌లోనే. ఈ డివిజన్‌లో 53 పోలింగ్ బూత్‌ల్లో 59,957 మంది ఉన్నారు. అమీర్‌పేట డివిజన్‌లో 44 పోలింగ్ బూత్‌లు ఉండగా 47,755 ఓటర్లు ఉన్నారు. ఇక రాంగోపాల్‌పేట, బేగంపేట, మోండా డివిజన్లు రెండేసి నియోజకవర్గాల పరిధి వ్యాపించి ఉండడంతో సనత్‌నగర్ నియోజకవర్గంలో ఆయా డివిజన్లలో పోలింగ్ బూత్‌ల సంఖ్యతో పాటు ఓటర్ల సంఖ్య కూడా తక్కువగా ఉంటుంది. మోండా డివిజన్ అత్యధికంగా కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఉండగా సనత్‌నగర్‌కు కేవలం 9 పోలింగ్ స్టేషన్లు మాత్రమే రాగా 10,329 మంది ఓటర్లు ఉన్నారు. ఇక బేగంపేట డివిజన్ కూకట్‌పల్లి, సనత్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో ఉండగా సనత్‌నగర్ నియోజకవర్గానికి సంబంధించి 28 పోలింగ్ బూత్‌ల్లో 29,640 మంది ఓటర్లు ఉన్నారు. రాంగోపాల్‌పేట డివిజన్ సనత్‌నగర్, కంటోన్మెంట్ పరిధిలో విస్తరించి ఉండగా ఈ డివిజన్‌లో 35 పోలింగ్ బూత్‌ల్లో 39,699 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గం మొత్తం ఆరు డివిజన్లు ఉండగా బన్సీలాల్‌పేట, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్లు పూర్తి స్థాయిలో విస్తరించి ఉన్నాయి.

సమ్మయ్య (బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్)
ఫోన్: 9154931446

ఏఈఆర్‌ఓలు..

పోలింగ్ బూత్‌ల కేటాయింపు: 1 నుంచి 72
క్రిస్టోఫర్ (బేగంపేట సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ)
ఫోన్: 98482 88106

పోలింగ్ బూత్‌ల కేటాయింపు: 73–132
వి.కుమార్ (బేగంపేట సర్కిల్ ఏఎంసీ) ఫోన్: 91000 91941

పోలింగ్ బూత్‌ల కేటాయింపు: 133 నుంచి 155, 174 నుంచి 193
టి.భీమయ్యగౌడ్ (అమీర్‌పేట తహసీల్దార్) ఫోన్: 94408 15872

పోలింగ్ బూత్‌ల కేటాయింపు: 156 నుంచి 173, 194 నుంచి 229
డి.జగన్ (డిప్యూటీ కమిషనర్, ఖైరతాబాద్ సర్కిల్)
ఫోన్: 91540 32866

డివిజన్ల వారీగా ఓటర్లు

డివిజన్	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
బన్సీలాల్‌పేట	31993	33156	1	65150
రాంగోపాల్‌పేట	20,917	18779	3	39699
బేగంపేట	15,324	14315	1	29640
మోండా	5304	5025	0	10,329
అమీర్‌పేట	25539	22213	3	47755
సనత్‌నగర్	31776	28179	2	59957

ఆదరణ హోమ్‌లో హోలీ వేడుకలు



ఆదరణ హోమ్ చిన్నారులతో రెస్టారెంట్ ప్రతినిధులు

సనత్‌నగర్: అనాథ, నిరుపేద పిల్లలకు ఆశ్రయం, విద్యను అందిస్తున్న ఆదరణ హోమ్ పిల్లలతో ప్లాట్‌ఫామ్–65 ట్రైన్ రెస్టారెంట్ ప్రతినిధులు హోలీ సంబురాలను జరుపుకున్నారు. రంగులతో ఆడుకుంటూ ఆ చిన్నారుల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం రెస్టారెంట్ నిర్వాహకులు నిర్వహించిన సహపంక్తి భోజనాలను ఆస్వాదించారు. ఈ సందర్భంగా ప్లాట్‌ఫామ్–65 మేనేజింగ్ డైరెక్టర్ సద్గుణ్ పాథా మాట్లాడుతూ.. తమ రెస్టారెంట్‌లో మధుర జ్ఞాపకాలను అందించడానికి ప్రాధాన్యం ఇస్తామని చుట్టూ ఉన్న సమాజానికి మద్దతుగా నిలిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని రూపొందించి అమలు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ శ్రీకాంత్, బ్రాంచ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సహపంక్తి భోజనాలు చేస్తున్న చిన్నారులు

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 19, క్యారెట్ 19, దొండ 28, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 48, గోకరకాయ 35, కీర 25, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 25, చామగడ్డ 40, మొరంగడ్డ 19, కందగడ్డ 60, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

'మోదీ హటావో దేశ్ బచావో' ప్రచారానికి సిద్ధమవ్వాలి



నినాదాలు చేస్తున్న సీపీఐ నేతలు

లాలాపేట: దేశానికి ప్రమాదకరమైన బీజేపీని ఓడించేందుకు ఏప్రిల్ మొదటి వారంలో మోదీ హటావో దేశ్ బచావో ప్రచార కార్యక్రమానికి సిద్ధమవ్వాలని సికింద్రాబాద్ సీపీఐ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నఫీజ్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో జరిగిన సీపీఐ సికింద్రాబాద్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత పదేళ్ల మోదీ పాలనలో ప్రజలకు ఉపయోగపడే పని ఏదీ చేయకపోగా, నిరంతరం మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టారని ఆరోపించారు. మతం పేరుతో రాజకీయ లబ్ధి పొందుతూ ప్రజాస్వామ్య బద్ధంగా ఏర్పాటైన ప్రభుత్వాలను అస్థిరపర్చడం, ప్రశ్నించే ప్రతిపక్ష నేతల గొంతులను నొక్కుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు కట్టబెట్టారని పేర్కొన్నారు. వందే భారత్ రైలుకు పదిసార్లు జెండా ఊపారు తప్ప కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌కు చేసిందేమీ లేదన్నారు. అందుకే వచ్చే ఎన్నికల్లో బీజేపీ, కిషన్‌రెడ్డిని ఓడించేందుకు పార్టీ శ్రేణులంతా క్రియాశీలకంగా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో కొమురెల్లి బాబు, శ్రీహరి, గౌరీ నాగరాజ్, గువ్వల మల్లేష్, యాకోబ్, హుస్సేన్, రవికాంత్, దేవేందర్, వెంకట్ గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా రాధాకృష్ణ భజన



కిషన్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: బెంగాలీ యువ మండలి ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని విశ్వకర్మ భవన్‌లో రాధాకృష్ణ భజన ఘనంగా నిర్వహించారు. మూడు రోజులు పాటు జరిగిన భజనలో శ్రీ కృష్ణుడి ఆటాపాటలతో అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ చీర సుచిత్రను సన్మానించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి హుండీ ద్వారా రూ.31,39,435 ఆదాయం వచ్చినట్లు ఈవో మనోహర్‌రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో చైర్మన్ రామేశ్వర్, దేవాదాయ శాఖ అధికారులతో పాటు భక్తులు పాల్గొన్నారు.



ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి



నీటి వినియోగంపై కరపత్రాలు ఆవిష్కరించిన హరిశంకర్

జలమండలి జీఎం హరిశంకర్

అమీర్‌పేట్: తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని జలమండలి జీఎం హరిశంకర్ సూచించారు. ప్రపంచ వాటర్‌డే సందర్భంగా వారం రోజుల పాటు నీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. మంగళవారం సనత్‌నగర్ డివిజన్ కేఎల్‌ఎన్‌వై పార్కులో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటిని సరఫరాల చేయాల్సిన అవసరం ఉందన్నారు. భూగర్భ జలాలు అడుగంటుతున్న తరుణంలో నీటి వినియోగానికి ప్రాధాన్యం ఏర్పడిందని తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూర్‌లో వేసవి ప్రారంభ దశలోనే తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడిందని గుర్తు చేశారు. వృథా నీరు భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కేఎల్‌ఎన్‌వై వాకర్స్, సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీజీఎం వంశీకృష్ణ, మేనేజర్ హిందుజ, పార్కు చైర్మన్ శాబాద్ శ్రీనివాస్ రావు, ప్రసిడెంట్ రమేశ్ గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు అశోక్ యాదవ్ రాజీనామా



కొమ్ము అశోక్ యాదవ్

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా. కొమ్ము అశోక్ యాదవ్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో గొల్లకురుమలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ కోసం డీడీలు కట్టించుకుని గొర్రెల యూనిట్లు ఇవ్వకుండా దాదాపు 18 నెలల పాటు కాలయాపన చేసిందన్నారు. డీడీలు చెల్లించిన వారు అప్పులపాలైన సంఘటనలు ఉన్నాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గొల్లకురుమలకు తగిన న్యాయం చేయకపోవడంతోనే పార్టీని వీడుతున్నట్లు స్పష్టం చేశారు.

డాక్టరేట్ ప్రదానం



సుధారాణి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ విద్యార్థిని సుధారాణికి జన్యుశాస్త్రంలో పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. జన్యుశాస్త్రం అధ్యాపకురాలు ప్రొ.రోజరాణి పర్యవేక్షణలో క్యారెక్టరైజేషన్ ఆఫ్ ఫైటో ఎక్స్‌ట్రాక్ట్ ఫర్ యాంటీ ఏపీలెప్టిక్ యాక్టివిటీ ఆఫ్ అకాలిఫా ఇండికా అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. డాక్టరేట్ అందుకున్న సుధారాణికి పెద్దనాన్న మాజీ ఎమ్మెల్యే అబ్రహాంతో పాటు తల్లిదండ్రులు యేసుబు, భాగ్యమ్మ అభినందించారు.

తల్లి, ఇద్దరు కూతుళ్ల అదృశ్యం



నందిని



అక్షయ



సుజాత

అడ్డగుట్ట: ఓ మహిళా తన ఇద్దరు కూతుళ్లతో అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సబిత వివరాల ప్రకారం.. వారాసీగూడలోని ఇంద్రనగర్ భూలక్ష్మి దేవాలయం వెనుక వీధిలో నివాసముంటున్న నర్సింహా–నందిని(33) దంపతులు. వీరికి ఓ కుమారుడు, ఇద్దరు కూతుళ్లు అక్షయ (11), సుజాత(08) ఉన్నారు. కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య చిన్న చిన్న తగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 21న సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇద్దరు కూతుళ్లను తీసుకొని వెళ్లిపోయింది. ఉద్యోగం నుంచి ఇంటికొచ్చిన భర్త నర్సింహాకు భార్య పిల్లలు కనిపించకపోవడంతో తెలిసిన వారు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'దళితుల ఐక్యతను దెబ్బతీసింది చంద్రబాబే'

లిబర్టీ: విభజించు, పాలించు అన్న విధానం ద్వారా గత ఉమ్మడి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దళితుల్లో చిచ్చు పెట్టారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ఆరోపించారు. మాల మహానాడు కార్యాలయంలో మంగళవారం శ్రీకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ పేరిట దళితుల ఐక్యతను చంద్రబాబునాయుడు దెబ్బతీశారని ఆరోపించారు. దళితులు రాజ్యాంగ హక్కుల కోసం, తమ సమస్యల పరిష్కారం కోసం 1995 వరకు సంఘటితంగా పోరాటం చేశారని గుర్తుచేశారు. ఎప్పుడైతే వర్గీకరణను కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పాటైందో, దాన్ని అదునుగా తీసుకొని నాటి సీఎం చంద్రబాబు దళితుల ఐక్యతను దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంద కృష్ణ మాదిగ ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి వంత పాడుతారని ఆరోపించారు. తనకు తన ప్రయోజనాలు తప్ప దళిత జాతికి చేసింది ఏమీ లేదని ఈ సందర్భంగా విమర్శించారు. రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటించిన బీజేపీకి మందకృష్ణ మాదిగ మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యశోదా ఆర్గానిక్స్‌కు ఇన్నోవేటివ్ అవార్డు



జస్టిస్ చంద్రయ్య, జయేష్ రంజన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అశోక్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ది కనెక్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని యశోదా ఆర్గానిక్స్ సంస్థకు ఇన్నోవేటివ్ బిజినెస్ అవార్డును అందజేశారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖల కార్యదర్శి జయేష్ రంజన్, మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య చేతుల మీదుగా యశోదా ఆర్గానిక్స్ సంస్థ ప్రొప్రైటర్ జి.అశోక్‌కుమార్ ఈ అవార్డును అందుకున్నారు. అనంతరం సంస్థలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అశోక్‌కుమార్ మాట్లాడుతూ గత ఆరేళ్లుగా గానుగ నూనెలు, ఆర్గానిక్ సిరిధాన్యాలు, పప్పులు తదితర వస్తువులను సరసమైన ధరలకు విక్రయిస్తున్నందుకు ఈ అవార్డును ఎంపిక చేసినట్లు తెలిపారు. కల్తీ లేని ఆహారపదార్థాలను అందజేస్తున్నందుకు తమను గుర్తించి ఇన్నోవేటివ్ అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. నమ్మకమైన తమ సేవలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు.

చేతిరాత పోటీలో స్నేహిత్‌కు ప్రథమ బహుమతి



చేతిరాత పోటీలో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి అందుకున్న విద్యార్థి స్నేహిత్

కాచిగూడ: నారాయణ విద్యాసంస్థలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'దాండీ–స్టైలస్ – అందమైన చేతిరాత' పోటీ పరీక్షలో నారాయణగూడలో మొదటి తరగతి చదువుతున్న విద్యార్థి స్నేహిత్ ఐదు రౌండ్లలో ప్రతిభను చాటి రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతితో పాటు గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల అధినేత పొంగూరు శరణి మాట్లాడుతూ పిల్లల్లో అంతర్గత ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నారాయణ సంస్థల ఈ–చాంప్స్ కో ఆర్డినేటర్ భవాని, ఆర్ అండ్ డి మహేశ్వరి, నారాయణగూడ జోన్ ఏజీఎం బాల పరమేశ్వరి, ప్రిన్సిపాల్ హర్‌నీత్ కౌర్, వైస్ ప్రిన్సిపల్ మోహి ఉన్నిసా పాల్గొన్నారు.

పద్మశాలీలకు రెండు ఎంపీ సీట్లు ఇవ్వాలి

కాంగ్రెస్ పార్టీకి కందగట్ల స్వామి విజ్ఞప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఈరవత్రి అనిల్, కందగట్ల స్వామి

కాచిగూడ: లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్, భువనగిరి స్థానాలను పద్మశాలి అభ్యర్థులకు కేటాయించాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం నారాయణగూడలోని పద్మశాలిభవన్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమ్మర్తపు మురళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత, టెక్స్‌టైల్స్, పద్మశాలి కార్పొరేషన్లకు చైర్మన్లు, పాలకమండళ్లను వెంటనే నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. నిజామాబాద్ ఎంపీ టికెట్‌ను రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కు ఇవ్వాలని కోరారు. ఈరవత్రి అనిల్ మాట్లాడుతూ చేనేత, పవర్‌లూమ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేవిధంగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ గజం అంజయ్య, చేనేత రాష్ట్ర, జాతీయ అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నేతలు గడ్డం జగన్నాథం, వనం విశ్వనాథం, మాచర్ల రాంచందర్, బొమ్మ రఘురాం, వనం దుశ్యంతల, డాక్టర్ పుట్టా పాండురంగయ్య, అవ్వారు భాస్కర్, గుంటక రూపా, మెతుకు సత్యం, రమేష్, బొమ్మ అమరేందర్, కత్తుల సుదర్శన్, అంబటి శ్రీనివాస్, గౌతం, చిన్ని రాకేష్, కర్నాటి శ్రీనివాస్, పెద్ద జగదీష్, రాపోలు జ్ఞానేశ్వర్, తడక రమేష్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని ఆంధ్ర మహిళా సభ (ఏఎంఎస్) కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ (డీఏఎంఎఫ్ కోఫేమ్)లో వివిధ సర్టిఫికెట్ల కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ రమాప్రభ మంగళవారం తెలిపారు. ఆరు వారాల న్యూస్ రీడింగ్, వాయిస్ ఓవర్, డబ్బింగ్, యాక్టింగ్ తదితర సర్టిఫికెట్ల కోర్సుల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 1 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల మహిళలు, పురుషులు వయోపరిమితితో నిమిత్తం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు 9441768811, 9441386157 లలో సంప్రదించవచ్చు.

బీజేపీతోనే అవినీతి రహిత పాలన సాధ్యం

కాచిగూడ: దేశంలో అవినీతిరహిత పాలన నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అధ్యక్షతన మోర్చా రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి నేతలు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. కాసం వెంకటేశ్వర్లు, సి.వినోద్ యాదవ్, రాధేశ్యాం, నందం దివాకర్, ఈశ్వరప్ప, సంజయ్ గనాటే, మహేష్, రమేష్ గౌడ్, శంకర్ పాల్గొన్నారు.

ఆసియాలో శరవేగంగా రాజకీయ మార్పులు



జ్యోతివెలిగించి సెమినార్ ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు

తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి

కవాడిగూడ: ఆసియా ఖండంలోని దేశాల రాజకీయాల్లో శరవేగంగా మార్పులు వస్తున్నాయని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అన్నారు. దోమలగూడలోని ఏవి కళాశాలలో మంగళవారం ఏవీ కళాశాల, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏసియన్ స్టడీస్ సంయుక్త ఆధ్వర్యంలో 'ఆసియా భౌగోళిక– రాజకీయ సవాళ్లు'అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ మానవ మనుగడ, పర్యావరణ పరిరక్షణ శాంతి, సౌభ్రాతృత్వం అన్న అంశాలతో భవిష్యత్‌లో ఆసియా దేశాలన్నీ కూటమిగా ఏర్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ బీం బహదూర్ సుబ్బా, రాజకీయ విశ్లేషకులు గిరిధర్ మామిడి, ఏవీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజలింగం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏసియన్ స్టడీస్ సెక్రటరీ డాక్టర్ గీతారెడ్డి, కోశాధికారి ప్రొఫెసర్ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పీహెచ్‌డీ ఫీజు ఉపసంహరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పెంచిన పీహెచ్‌డీ ట్యూషన్ ఫీజును అధికారులు ఉపసంహరించుకున్నారు. ఫీజులు చెల్లించుకునే ఆర్థిక స్తోమత లేదని విద్యార్థుల ఆందోళన కారణంగా పెంచిన ఫీజును రద్దు చేసి పాత ఫీజు విధానానే కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. ఇది విద్యార్థుల పోరాట ఫలితమని ఏఐఎస్ఎఫ్ నాయకుడు, పీహెచ్‌డీ విద్యార్థి నెల్లి సత్య పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఓయూ పీడీఎఫ్ స్కాలర్ మృతి



ఉస్మానియా యూనివర్సిటీ: రోడ్డు ప్రమాదంలో ఓయూ పీడీఎఫ్ స్కాలర్ మంగళవారం మృతి చెందాడు. ఓయూ వ్యాయామ విద్య (ఫిజికల్ ఎడ్యుకేషన్) విభాగంలో పీహెచ్‌డీ డాక్టరేట్ అనంతరం ప్రొ.సునీల్ పర్యవేక్షణలో పీడీఎఫ్ (పోస్టు డాక్టరల్ ఫెలో) చేస్తున్న డా. నల్లెల శ్రీనివాస్ (45) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మరణించారు. మాతృశ్రీ ఇంజినీరింగ్ కాలేజీలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు. ఈనెల 25న వరంగల్ రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పీహెచ్‌డీ విద్యార్థి బాబులాల్ నాయక్ తెలిపారు. ఆయన మృతికి ఓయూ వీసీ ప్రొ.రవీందర్, పాలమూరు వీసీ ప్రొ.లక్ష్మీకాంత్ రాథోడ్, ఓయూ అధ్యాపకులు ప్రొ.సత్యనారాయణ, ప్రొ.రాజ్‌కుమార్, ప్రొ.సునీల్ సంతాపం తెలిపారు.

ప్రత్యేక రైళ్ల పొడిగింపు

సాక్షి, సిటీబ్యూరో: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వివిధ మార్గాల్లో ఏర్పాటు చేసిన 20 ప్రత్యేక రైళ్లను జూన్ చివరి వరకు పొడిగించినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్. రాకేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్–అగర్తల, సికింద్రాబాద్–డిబ్రూగఢ్, తిరుపతి–సంత్రాగచ్చి, హైదరాబాద్–గోరఖ్‌పూర్, సికింద్రాబాద్–రెక్సాల్, హైదరాబాద్–రెక్సాల్, సికింద్రాబాద్–దానాపూర్, హైదరాబాద్–జైపూర్ ప్రత్యేక రైళ్లు జూన్ నెలాఖరు వరకు రాకపోకలు సాగించనున్నాయి.